క్లుప్తంగా

ఈవీఎంలపై అవగాహన



దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి గ్రామంలో ఓటింగ్‌పై ఓటర్లకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా ఏ విధంగా ఓటు వినియోగించుకోవాలి..ఈవీఎంలపై ఏఏ గుర్తులు ఉంటాయి..బటన్ నొక్కిన తరువాత ఓటు వేశామా..లేదా అనేది ఎలా తెలుస్తుంది అనే అంశాలపై వృద్ధులకు..కొత్తగా ఓటు వచ్చిన వారికి అవగాహన కల్పించారు. వివిధ రాజకీయ పార్టీల నేతలకు కూడా ఓటు హక్కు వినియోగంపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శరత్‌కుమార్, సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, వీఆర్వో మణికుమార్ పాల్గొన్నారు.

ఒప్పిచర్లలో ఫైలేరియా సర్వే



కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు గురువారం సాయంత్రం ఫైలేరియా (బోదకాలు) సర్వే నిర్వహించారు. గ్రామంలో ఐదుగురికి బోదకాలు వ్యాధి ఉన్నందున ఇంకా కొత్త కేసులు ఏమైనా ఉన్నాయా అని గుర్తించేందుకు ఇంటింటికి తిరిగి అనుమానితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. గడ్డి ఉన్న మురికి కుంటల్లో ఎక్కువగా ఉండే క్యూలెక్స్ దోమ ఫైలేరియా ఉన్న వ్యక్తిని కుట్టి తర్వాత అది వేరే వారిని కుడితే ఫైలేరియా వచ్చే అవకాశం ఉంటుందని కారెంపూడి పీహెచ్‌సీ సీహెచ్ఓ మల్లయ్య తెలిపారు. ఇంటి పరిసరాలలో మురికి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే జ్వర పీడితులను కూడా గుర్తిస్తున్నారు. సూపర్‌వైజర్ మస్తాన్ వలి, లాలునాయక్, ఆరోగ్య సిబ్బంది రాజు, అల్లాభక్షు, ఎంఎల్‌హెచ్‌పీ కిరణ్మయి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి

గురజాల : జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్యలు అన్నారు. ఎంపీపీ కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ సురక్ష శిబిరాల్లో అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు కూడా ఈ వైద్య శిబిరంలో వైద్యులు చూడటం జరుగుతుందన్నారు. ఈ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

లక్ష్మీవల్లభ అలంకారంలో శ్రీవారు



సత్తెనపల్లి: ధనుర్మాసం పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి రామాలయం, వేంకటేశ్వర స్వామి దేవాలయం, రైల్వే స్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయం, ఐదులాంతర్ల సెంటర్‌లోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయం, కట్టమూరివారి వీధిలోని కోదండ రామాలయంలో గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారికి లక్ష్మీ వల్లభ అలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకొన్నారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలు



సత్తెనపల్లి: అయోధ్య శ్రీ రామమందిరం నుంచి తీసుకువచ్చిన రామయ్య అక్షింతలు పట్టణంలో ఇంటింటికీ నారాయణ సేన నగర సంకీర్తన సభ్యుల ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నారాయణ సేన నగర సంకీర్తన సభ్యులు మాట్లాడుతూ అయోధ్య శ్రీరాముని అక్షింతలు ప్రతి ఇంట్లో అక్షింతల్లో కలుపుకొని ప్రతి శుభకార్యంలో వీటిని వాడే విధంగా చేసుకోవాలని సూచించారు. నారాయణ సేననగర సంకీర్తన సభ్యులు, రామ భక్తులు ఉన్నారు.

ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే



పిన్నెల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జెడ్పీటీసీ శివాయాదవ్, మండల కన్వీనర్ సింగరయ్య

మాచవరం: 2019 సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జెడ్పీటీసీ జె.శివాయాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య అన్నారు. మండలంలోని పిన్నెల్లి, పిల్లుట్ల, మోర్జంపాడు గ్రామాల్లో వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు ఉత్సవాల్లో భాగంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అవ్వాతాతలకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ రూ.3 వేలకు పెంచి దేశంలోనే అత్యధికంగా పింఛన్లు ఇచ్చే ప్రభుత్వంగా నిలిచిందన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీర్వాదాలు మెండుగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ యు.వరప్రసాద్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, వైస్ ఎంపీపీ చింతపల్లి నన్నేషైదా, సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అల్లాభక్షు, ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



విజయపురిసౌత్‌లో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పింఛన్ లబ్ధిదారులు

పెరిగిన పింఛన్ అందజేత

పిడుగురాళ్లరూరల్: మాట ఇస్తే మడమ తిప్పని నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, సామాజిక భద్రత పింఛన్ ఎక్కువ ఇచ్చే రాష్ట్రం దేశంలో ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని, అది సీఎం జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యమని ఎంపీపీ అల్లు సత్యవతిపిచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, తుమ్మల చెరువు తదితర గ్రామాల్లో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పిడుగురాళ్ల మండలంలో 9,009 పింఛన్లు అందిస్తున్నామని, అర్హతే ప్రామాణికంగా పార్టీ, కులం, మతం చూడకుండా పింఛన్ అందజేస్తున్నామన్నారు. అనంతరం లబ్ధిదారులకు రూ.3 వేల పింఛన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశయ్య, మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు పీర్ల వీరరాఘవయ్య, షేక్ కాశింబి బడేషా, బైరపోగు కుమారి ఏలయ్య, రాగిడి రాజారావు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల కళ్లల్లో ఆనందం

విజయపురిసౌత్: నూతన సంవత్సరం రోజున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ మొత్తం 3వేల రూపాయలకు పెంచటంతో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. గురువారం పెరిగిన పింఛన్ సొమ్ము పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఫిల్టర్‌హౌస్ ఏరియాలో వలంటీర్లు బీర్నీడి భరత్, రహమతూన్, మనీషారాణి చేపట్టారు. దీంతో లబ్ధిదారులు సంతోషంతో జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేసి జేజేలు పలికారు.

పర్యాటక శాఖ అభివృద్ధికి కృషి చేయండి


డీవీఎం చైతన్య

విజయపురిసౌత్: పర్యాటక శాఖ అభివృద్ధి కోసం టూరిజం ఉద్యోగులు కృషి చేయాలని విజయవాడ డివిజనల్ మేనేజర్ చైతన్య కోరారు. విజయవాడ డివిజనల్ మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన విజయపురిసౌత్‌లోని లాంచీ స్టేషన్‌ను గురువారం సందర్శించారు. ఇప్పటివరకు విజయవాడ డీవీఎంగా పనిచేసి బదిలీపై నెల్లూరు వెళ్తున్న శ్రీనివాసరావుతో కలిసి టూరిజం ఉద్యోగులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఉద్యోగులు విధి నిర్వహణలో బాధ్యతగా మెలగాలన్నారు. అనంతరం డీవీఎం చైతన్య, శ్రీనివాసరావులను ఉద్యోగులు సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మేనేజర్లు శివారెడ్డి, శ్రీనివాసరావు, శ్రీధర్, ఇరిగేషన్ శాఖ జేఈ కె.వి.కోటేశ్వరరావు, వినయతుల్లా, పులుసు వీరారెడ్డి, స్వామి పాల్గొన్నారు.



లాంచీస్టేషన్ వద్ద టూరిజం అధికారులతో విజయవాడ డివిజనల్ మేనేజర్ చైతన్య

బులెట్‌ను దహనం చేసిన దుండగులు



పిడుగురాళ్ల: వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు చెందిన బులెట్ వాహనం గుర్తు తెలియని వ్యక్తులు గురువారం తెల్లవారుజామున దగ్ధం చేసిన ఘటన మండలంలోని జానపాడు గ్రామంలో జరిగింది. ఘటనకు సంబంధించి బాధితుడు మక్కెన సాంబశివరావు తెలిపిన వివరాల మేరకు రోజు మాదిరిగానే బుధవారం రాత్రి జానపాడు గ్రామంలోని తన ఇంటి ముందు బులెట్ వాహనాన్ని ఉంచానని, తెల్లవారుజామున వాహనం నుంచి మంటలు, పొగలు రావటంతో చూసి వెంటనే మంటలను ఆర్పి వేయటం చేశామని తెలిపారు. దుండగలపై చర్యలు తీసుకోవాలని పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ

దుర్గి: జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముటుకూరు పశు వైద్యశాలలో గురువారం పశువులకు టీకాల నిర్వహణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గొంది నాసరయ్య, పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ పశు పోషకులు, రైతులు వైద్య శిబిరాన్ని ఉపయోగించుకొని పశువులకు వ్యాధి నిరోధక టీకాలను ఇప్పించాలని రైతులను కోరారు. పశువైద్యురాలు వై.నాగవల్లి మాట్లాడుతూ రైతులు, పశుపోషకులు తప్పకుండా పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ టీకాలు వేయించాలన్నారు. ముందుగా రక్త నమూనాలను సేకరించారు. వైద్యశిబిరంలో 125 గేదెలు, 22 ఆవులకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయకులు నాగ సాయినాయక్, గోపాల్ మిత్ర, మరియబాబు, పశుమిత్ర సుధీర్, ట్రైనీలు సూరిబాబు, విజయేంద్ర, రైతులు పాల్గొన్నారు.



ముటుకూరు పశు వైద్యశాలలో టీకాల నిర్వహణ కార్యక్రమంలో సర్పంచ్ గొంది నాసరయ్య

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ దుర్మరణం



పాస్టర్ బిరుదు భూపతిరాజు (ఫైల్)

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో పాస్టర్ దుర్మరణం చెందిన ఘటన జాతీయ రహదారిపై గణపవరం పాత టీబీ హాస్పిటల్ వద్ద బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్సై జె.బలరామ్‌రెడ్డి వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణానికి చెందిన బిరుదు భూపతిరాజు (32) చర్చిలో పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. గుంటూరులోని తన మిత్రుడిని కలిసేందుకు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో టీబీ హాస్పిటల్ వద్దకు వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో.. ప్రమాదానికి గురయ్యాడు. తలకు హెల్మెట్ ఉన్నప్పటికీ తీవ్రగాయాలైన భూపతిరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం బంధువులకు అప్పగించారు. భార్య బండారు సోనియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వీరికి ఏడాదిన్నర వయస్సు గల కుమార్తె ఉంది.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

నరసరావుపేట టౌన్: వ్యక్తి మృతిపై అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ అశోక్ కుమార్ గురువారం తెలిపారు. లక్నోకు చెందిన సయ్యద్ వసీ(65) రామిరెడ్డిపేటలోని ఓ అద్దె గృహంలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతను నివసిస్తున్న ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ రహంతుల్లా ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. వసీ మృతి చెంది కనిపించాడు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు నాలుగు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ మేరకు ఇంటి యజమాని పాలడగు రత్నకుమారి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనఘాదేవి సామూహిక వ్రతం



వినుకొండ(నూజెండ్ల): వితంరాజుపల్లి సాయిబాబా దేవస్థానంలో అనఘాదేవి సామూహిక వ్రతం గురువారం ఘనంగా నిర్వహించారు. హిమాలయ గురూజీ పలువురు దంపతులతో వ్రతం చేయించారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెండేల కాశీ, పుల్లారావు, సురేష్ పాల్గొన్నారు.

అయోధ్య రామమందిరం అక్షింతలు పంపిణీ



చిలకలూరిపేటటౌన్: అయోధ్య రామ మందిరం అక్షింతలు, ప్రారంభోత్సవ వివరాల కరపత్రాలు పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో వెంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తలు, ప్రసన్నాంజనేయస్వామి ఆలయ కమిటీ సంయుక్తంగా ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తున్నారు. ఆయా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అక్షింతలను స్వీకరించిన భక్తులు విధిగా వాటిని తమ ఇళ్లల్లోని పూజా మందిరంలో ఉంచి, ఈ నెల 22న రామమందిరం ప్రారంభోత్సవం నిర్వహించిన తర్వాత ఇంట్లో ఐదు దీపాలను వెలిగించి, కుటుంబ సభ్యులంతా తలపై చల్లుకోవాలని సూచించారు. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహాలతో వీధుల్లో రామనామాన్ని జపిస్తూ పర్యటించారు.

సర్వే ఉద్యోగులు ప్రజలకు అండగా ఉండండి

ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల రూరల్: సర్వే ఉద్యోగులు సకాలంలో ప్రజలకు సేవలందించి ప్రభుత్వానికి, ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వే ఉద్యోగుల క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి అందులో సర్వే ఉద్యోగులను నియమించి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఆయన నమ్మకాలను వమ్ము చేయకుండా ప్రజలకు సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వే ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి జింకల ఆదినారాయణ, తాలూకా అధ్యక్షుడు వడితే ముని, కార్యదర్శి కేశబోయిన ఏసురాజు, ఉపాధ్యక్షులు హరినాయక్, సంయుక్త కార్యదర్శి కస్నా నాయక్, కోశాధికారి నరేష్‌నాయక్ తదితరులున్నారు.



సర్వే ఉద్యోగుల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

సంక్రాంతికి ఆత్మీయ సమ్మేళనం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: సంక్రాంతికి నాన్ రెసిడెంట్ ఆఫ్ గురజాల వారితో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో పుట్టి పెరిగి చదువుకొని వ్యాపార రీత్యా, ఉద్యోగ రీత్యా ఇతర రాష్ట్రాల్లో, జిల్లాల్లో ఉంటున్న నాన్ రెసిడెంట్ ఆఫ్ గురజాల వారికి ఈ నెల 14వ తేదీన సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతి పరులంతా తప్పనిసరిగా కుటుంబ సభ్యులతో హాజరు కావాలని పిలుపునిచ్చారు. గురజాల నియోజకవర్గంలో ఇంత వరకు జరిగిన రూ.3,471 కోట్ల అభివృద్ధి గురించి తెలపాల్సిన, తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని అన్నారు. గత ఎన్నికల ముందు అందరితో ఆత్మీయ సమావేశం హైదరాబాద్‌లో నిర్వహించటం జరిగిందని, ఎన్నికల తర్వాత కరోనా వలన సమావేశం జరగలేదని, పలువురి సూచనల మేరకు ఈ ఆత్మీయ సమావేశం ఎక్కడో కంటే అభివృద్ధి జరిగిన గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల సమీపంలో మెడికల్ కాలేజీ వద్ద ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు కుటుంబ సమేతంగా హాజరు కావాలని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు.

విద్యా జ్యోతి కానుక విద్యార్థులకు గొప్ప వరం

దుర్గి: ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో సంస్కరణలు చేపట్టి విద్యార్థుల జీవితంలో వెలుగు నింపిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని అడిగొప్పల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్ అందజేశారు. నాడు నేడు కింద అన్ని వసతులను సమకూర్చి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సీఎం జగన్ చేసిన కృషి మరువలేనిదన్నారు. వచ్చే పబ్లిక్ పరీక్షలలో విద్యాజ్యోతి కానుక విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నలబోతు చిన్నబ్బాయి, ఎంపీపీ చల్లా శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగెండ్ల లక్ష్మీనారాయణ, డాక్టర్ వెంకయ్య, షేక్ నాగుల్‌మీరా, రాయల మధుబాబు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

విద్యార్థుల చదువుకు చేయూతనందిస్తాం

వెల్దుర్తి: శ్రీ రామకృష్ణ సేవా సమితి, మాచర్ల వారి ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను గురువారం ఉచితంగా కన్వీనర్ మెట్టు గోవిందరెడ్డి అందజేశారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని జెడ్పీహెచ్ఎస్, సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో తయారు చేసిన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివేందుకు 10వ తరగతి ఉత్తీర్ణత ఎంతో ముఖ్యమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేస్తామన్నారు. ఈ స్టడీ మెటీరియల్‌ను నియోజకవర్గంలోని ప్రభుత్వ, కస్తూర్బా, కేజీబీవీఎస్ పాఠశాలలకు ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రంగరాజు, ఉపాధ్యాయులు చింతా బాదరయ్య, సభ్యులు మహేష్‌రెడ్డి, గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రవి, రిటైర్డ్ హెచ్ఎం ముత్యాల పాపిరెడ్డి తదితరులున్నారు.



విద్యార్థినికి స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

ఆడుదాం ఆంధ్రాకు విశేష స్పందన

దాచేపల్లి : ఆడుదాం ఆంధ్రా ఆటలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. గురువారం మండల వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు హోరాహోరీగా జరిగాయి. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, క్రికెట్ తదితర పోటీల్లో ఆటగాళ్లు ఉత్సాహంగా పాల్గొని సత్తాచాటారు. ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, ఎంపీడీవో శోభారాణి తదితరులు ఈ పోటీలను తిలకించారు.



వాలీబాల్ ఆడుతున్న క్రీడకారులు

క్రీడాకారులను సీఎం జగన్ ప్రోత్సహిస్తున్నారు..



గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉండే నాలాంటి ప్రతిభావంతులైన క్రీడాకారులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నారు. మాలో ప్రతిభ ఉన్నా ప్రోత్సాహం లేక ఆటలు ఆడలేకపోయాం. కానీ సీఎం జగనన్న గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్రీడల్లో ఆణిముత్యాలు ఉంటారని గుర్తించి ఆడుదాం ఆంధ్రాను ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆడుదాం ఆంధ్రాకు విశేష స్పందన లభిస్తుంది. ఈ ఆటల ద్వారా క్రీడాకారులు ప్రతిభను మెరుగుపర్చుకునేందుకు గొప్ప అవకాశం.

– మీసాల దేవిద్‌రాజు

క్రీడాస్ఫూర్తిని నింపారు..



ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తిని నింపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ క్రీడల్లో నేను పాల్గొనటం సంతోషంగా ఉంది. ప్రతి ఒక్కరు ఆట చాలా హుందాతనంగా ఆడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు ఎక్కువగా ఈ ఆటల్లో పాల్గొంటున్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించేలా మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరుకుంటున్నాం.

– వినుకొండ దినకర్

7న టెన్త్ విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు

శావల్యాపురం: పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 7న ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నట్లు సుచరిత ఎడ్యూకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్ చందు తెలిపారు. గురువారం స్థానిక శ్రీరామా పబ్లిక్ స్కూల్లో ఆయన మాట్లాడుతూ గంగినేని ఫౌండేషన్, సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిభ పరీక్ష స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతుందన్నారు. పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థుల భయాన్ని పోగొట్టేందుకు ఈ పరీక్ష దోహదపడుతుందన్నారు. గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్ట్‌లలో డిసెంబరు నెల వరకు జరిగిన సిలబస్ నుంచి 100 మార్కుల మల్టిపుల్ చాయిస్ ప్రశ్నపత్రం ఉంటుందన్నారు. మండల స్థాయిలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు అల్పాహారం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువులకు గాలికుంటు టీకా

బొల్లాపల్లి : మూగచింతలపాలెం సచివాలయం పరిధిలో పశువైద్యాధికారి పి. అమీర్ బాషా పశు విజ్ఞాన బడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. పాడి రైతులకు పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు పంపిణీ చేశారు. పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. 120 గేదెలకు, 30 లేగ దూడలకు గాలికుంటు నివారణ టీకా వేశారు. ఎంపీటీసీ సభ్యుడు కడియం జోజి, సహాయక సిబ్బంది ఏడుకొండలు ఉన్నారు.

అంతర్జాతీయ లూయిబ్రెయిలీ దినోత్సవం



ముప్పాళ్ళ: ముప్పాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ లూయిబ్రెయిలీ దినోత్సవం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.సీతారామిరెడ్డి పాల్గొని లూయిబ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు స్వీట్లు, బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు ఎంఈఓ రూ.10వేల నగదును విరాళంగా అందించారు. కార్యక్రమంలో ప్రత్యేక అవసరాల కేంద్రం ఉపాధ్యాయుడు పి.అర్జున్, ఎల్.శ్రీనివాసరావు, వి.రాజేశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.